18102024-DIS-04_Layout 1 10/18/2024 2:18 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఆకలి రాజ్యం

దేశంలో సంపద పెరుగుతున్నది. కానీ, పంపిణీ సమతూకంగా జరగడం లేదు. దాని ఫలితంగా ధనవంతులు కుబేరులవుతుంటే పేదలు నిరుపేదలై నలుగుతున్నారు. సంపన్నుల మేడల నీడల్లో ఆకలి కేకలు పోటెత్తుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటిన తర్వాత ఇదీ వాస్తవిక పరిస్థితి. ప్రపంచబ్యాంకు 2024 సంవత్సరపు భౌగోళిక ఆకలి సూచీలో దీన్నే ఎత్తిచూపింది. ఈ సూచీలో 127 దేశాలుంటే అందులో భారత్ స్థానం 105గా నమోదైంది. సూచీ విశ్లేషణలో భారత్‌ను 'తీవ్రమైన' క్యాటగిరీలో చేర్చడం గమనార్హం. ఈ క్యాటగిరీలో భారత్ పాటు పాక్, అఫ్ఘాన్ ఉన్నాయి. కాగా దక్షిణాసియా ఇరుగుపొరుగు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక ఓ మోస్తరు క్యాటగిరీలో ఉండటం విశేషం. పోషకాహార లోపం, శిశు మరణాల రేటు వంటి అంశాల ఆధారంగా రూపొందించే ఈ నివేదికలో ఇండియా 27 శాతం స్కోరు చేసింది.

ఒక అంచనా ప్రకారం భారతదేశంలోని గృహోపయోగ ఆహారంలో ఏడాదిలో 68.7 మిలియన్ టన్నుల ఆహారపదార్థాలు వృథా అవుతున్నాయి. దాని విలువ రూ.50 వేల కోట్ల పైచిలుకే. ఈ విషయంలో మన దేశం ప్రపంచంలో రెండో స్థానం ఆక్రమిస్తున్నది. కానీ, ఆకలి సూచీ ప్రకారం భారత్ జనాభాలో 13.7 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతుండటం వింతల్లోకెల్లా వింతే మరి. అంతకన్నా ఘోరమైన విషయం ఏమంటే 35.5 శాతం ఐదేండ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం వల్ల ఎదుగుదల దెబ్బతింటున్నది. ఇంకా వారిలో 18.7 శాతం మందిలో ఎదుగుదల స్థగితం అవుతున్నది. 2.9 శాతం మంది పిల్లలు ఐదేండ్ల లోపు ఆకలి సమస్యల వల్ల మృత్యువు పాలవుతుండటం అత్యంత బాధాకరం. ఆహార హక్కు అని ప్రపంచదేశాలు ఊదరగొడుతున్నా అమలవుతున్నది అరకొర మాత్రమే. ఈ పరిస్థితుల్లో 2030 నాటికి విశ్వవ్యాప్తంగా సున్నా ఆకలి సూచీని సాధించాలన్న ఐరాస లక్ష్యం సాధ్యం కాదని ప్రపంచబ్యాంకు విశ్లేషణ నివేదిక పేర్కొనడం ఆందోళన కలిగించే అంశమే. వ్యవసాయ ఉత్పత్తి అంతకంతకు పెరుగుతున్న ఇండియాలో ఆకలి మంటలు ఎందుకో ఆలోచించాల్సిన ప్రభుత్వం మొత్తంగా ఆకలి సూచీ నే తప్పు పడుతున్నది. దాని వెనుక గల కొలమానాలలో లోపాలు వెదుకుతున్నది. పోయిన ఏడాది భారత్‌కు 111వ ర్యాంకు ఇచ్చిన సూచీని ప్రభుత్వం తిరస్కరించడమే కాకుండా, అది భారత వాస్తవ స్థితిని తెలియజేయడం లేదని కొట్టిపారేయడం తెలిసిందే.

భారతదేశంలో పైపైన సంపద పొంగులు కనిపిస్తున్నా భారతీయుల తలసరి ఆదాయం ప్రపంచ సగటులో నాలుగో వంతుకు దిగువనే ఉండిపోయింది. మరోవైపు ఆహార ధరలు 2022 నుంచి 2024 నాటికి 3.8 శాతం నుంచి 7.5 శాతానికి రెట్టింపైంది. కొన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ ఏడాది పంటలు గరిష్ఠ స్థాయిలో పండాయి. అయినా ఆకలి ఎందుకు పెరుగుతున్నదో తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. భారతదేశంలో ఆహారభద్రత, ఆరోగ్య సంరక్షణ సరైన రీతిలో సాగడం లేదని ఈ గణాంకాలు వేలెత్తి చూపిస్తున్నాయి. అద్దాన్ని నిందిస్తే లాభం లేదు. రోగం ఎక్కడుందో తెలుసుకుని మందు వేయాలి. ఉచిత రేషన్ ధాన్యం పంపిణీ గడువు పెంచుకుంటూ పోవడం కాదు, ప్రజల వాస్తవ ఆదాయం పెరగడం ఎలా అనేదాని మీద దృష్టిపెడితే గానీ ఆకలి సమస్య అంతం కాదని చెప్పక తప్పదు.

రాజకీయపక్షాలకు ఎగ్జిట్ ఆశాభంగమే!

'ఆశావహ అంచనాకు, సాధించిన ఫలితానికి మధ్య ఉండే తేడా ఆశాభంగం తప్ప మరేమీ కాదు' ఈ మాటలు చెప్పింది తత్వవేత్తో లేదా వ్యక్తిత్వ వికాస నిపుణుడో కాదు. సాక్షాత్తూ భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీల ఎన్నికల తేదీలు ప్రకటిస్తూ మంగళవారం ఆయన చేసిన వ్యాఖ్యల్లో ఇదొకటి. ఇటీవలి హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ వాస్తవ ఫలితాలకు భిన్నంగా ఉండటంతో ఈ అంశంపై ఈసీ అభిప్రాయాలు, పాత్ర గురించి తొలిసారి సీఈసీ విస్తృతంగా మాట్లాడారు.

నాంచారయ్య మెరుగుమాల

హరియాణా ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున ఎన్నికల సంఘం కావాలని బీజేపీకి తొలి రౌండ్లలో ఆధిక్యం వచ్చేవరకూ ఆగి ఉదయం 9.30 గంటలకు తన వెబ్‌సైట్‌లో ఫలితాల సరళి వెల్లడించిందని కాంగ్రెస్ ఆరోపించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సందర్భంగా ఎగ్జిట్‌పోల్స్‌పై తమ నియంత్రణ ఏమీ ఉండదంటూనే ఇకనుంచి ఎగ్జిట్‌పోల్స్ లోపరహితంగా, కట్టుదిట్టంగా చేయాలని రాజీవ్‌కుమార్ చేసిన సూచన స్వాగతించాల్సిన అంశమే. కానీ, ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు ఎప్పటివరకు ప్రకటించకూడదో ప్రతిసారీ ఈసీయే నిర్ణయిస్తుంది. వాస్తవానికి ఇండియాలో అత్యధికంగా నాలుగు సార్లు పార్లమెంటు ఎన్నికలు జరిగిన 1990 దశకంలో దశలవారీ పోలింగ్ ప్రక్రియ విస్తృతంగా నిర్వహించిన సంవత్సరాల్లో ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు లేదా అంచనాలను కూడా దశలవారీ పోలింగ్ ముగిసిన రోజుల్లోనే ప్రకటించేవి పోలింగ్ సంస్థలు, వాటికి సర్వే బాధ్యతలు అప్పగించిన టీవీ చానళ్లు లేదా దినపత్రికలు. అయితే, రెండు నుంచి ఆరేడు దశల్లో ఎన్నికలు జరిగినప్పుడు దశలవారీ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు రెండో దశ నుంచి చివరి దశ పోలింగ్ వరకూ ఓటర్లను ప్రభావితం చేస్తాయనే కారణంతో ఎన్నికల సంఘం ఈ తరహా ఎగ్జిట్‌పోల్స్‌ను పాతికేండ్ల కిందటే రద్దుచేసింది. ఈ దశలవారీ ఎగ్జిట్‌పోల్స్ అంచనాల వెల్లడి వల్ల ఓటర్లపై దుష్ప్రభావం ఉండనే ఉండదని రాజకీయ పండితులు, ఎన్నికల విశ్లేషకులు ఎందరు వాదించినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. చివరికి ప్రసిద్ధ 'హిందూ' మీడియా గ్రూప్‌కు చెందిన ఎన్.రామ్ సహా అనేకమంది జర్నలిస్టులు సుప్రీంకోర్టుకు ఈ విషయంపై వెళ్లారు. అయితే, సర్వోన్నత న్యాయస్థానం ఈసీ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో సాధారణ ఎన్నికల సమయంలో జరిపించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలను దాదాపు రెండు నెలలపాటు ఆగి ఒకేసారి ప్రకటించే పద్ధతిని గత పాతికేండ్లుగా ఇండియాలో అనుసరిస్తున్నారు.

ఐదేండ్లకోసారి జరిగే పార్లమెంటు ఎన్నికల (నాలుగైదు రాష్ట్రాల అసెంబ్లీలతో కలిపి) ప్రక్రియ షెడ్యూల్ విడుదల నుంచి చివరి దశ పోలింగ్ వరకూ దాదాపు రెండు నెలలకు పైగా ఉండటంతో చివరి దశ పోలింగ్ ముగిసిన అరగంటకు ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు విడుదలు చేయడం, అప్పటి నుంచి మూడు నాలుగు రోజులకు జరిగే ఓట్ల లెక్కింపులో అసలు ఫలితాల వెల్లడి కారణంగా ఎగ్జిట్ పోల్స్‌కు ప్రాధాన్యం తగ్గలేదు. కానీ, అతి కొద్దిరోజుల్లో 'ఎగ్జిట్ పోల్స్' ఫలితాలు రావడంతో పూర్వస్థాయిలో అవి ఆసక్తి, ఉత్సుకతను ప్రజల్లో రేకెత్తించలేకపోతున్నాయి. పోలింగ్‌కు ఎగ్జిట్‌పోల్స్ అంచనాల ప్రకటనకు మధ్య దూరం మరీ ఎక్కువవుతున్నది. పార్లమెంట్, పలు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలకు సంబంధించి పలు పోలింగ్ (మార్కెటింగ్ సర్వే), మీడియా సంస్థలు జరిపే ఎన్నికల సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ 1980ల ఆరంభం నుంచి 1990ల చివరి వరకూ దేశ ప్రజల దృష్టిని మరింత ఆకర్షిస్తూ వచ్చాయి.

> **21వ శతాబ్దంలో దశలవారీ ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల ప్రకటనపై నిషేధం విధించినా అవి ప్రాధాన్యం కోల్పోలేదు. వాస్తవానికి ఇండియాలో రెండో సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించారు. 1957 మార్చిలో జరిగిన ఈ ఎన్నికల్లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్ ఎగ్జిట్ పోల్స్ పరిమిత స్థాయిలో నిర్వహించి అంచనాలు ప్రకటించింది.**

1980లు, 1990ల చివరి మధ్య ప్రఖ్యాత సెఫాలజిస్టులు ప్రణయ్ రాయ్, యోగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్ శాంపిల్ సైజు 20,000, 30,000ల మధ్య ఉండేది. 1996 పార్లమెంట్ ఎన్నికల్లో సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) తొలిసారి దూరదర్శన్ కోసం చేసిన ఎగ్జిట్ పోల్‌లో 17,604 మంది ఓటర్లను పోలింగ్ కేంద్రాల బయట కలిసి అంచనాలు రూపొందించింది. 2000 సంవత్సరం నుంచి అంటే గత పాతికేండ్లలో ఈ పోలింగ్ సంస్థలు ఓటేసి వచ్చే వారిని ప్రశ్నావళితో కలిసి వారెవరికి ఓటేశారో వాకబు చేసే పద్ధతి మారలేదు గాని ఈ సంస్థల ప్రతినిధులు కలిసే ఓటర్ల సంఖ్య నియోజకవర్గాల వారీగా బాగా పెరిగిపోయింది. ప్రశ్నావళి నాణ్యత పెరగడంతోపాటు పోల్‌స్టర్లు కలిసే ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల మెరుగైన ఫలితాలు రావడం మొదలయ్యాయి. అయినా, అప్పుడప్పుడూ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు ఊహించనిరీతిలో తప్పుతున్నాయి.

14వ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై దాదాపు అన్ని సర్వే సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తప్పని మూడు రోజుల తర్వాత జరిగిన ఓట్ల లెక్కింపులో తేలిపోయింది. మెజారిటీ సర్వే మీడియా సంస్థల ఎగ్జిట్‌పోల్స్ నాటి పాలకపక్షమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేదే గెలుపు అని జోస్యం చెప్పాయి. దేశంలో మొదటిసారి ఎగ్జిట్స్‌పోల్స్ భారీస్థాయిలో విఫలమైంది ఈ 2004 సాధారణ ఎన్నికల్లోనే. ప్రతి ఎగ్జిట్ పోల్ ఫలితం ప్రకటించే ముందు తమ అంచనా ప్రకారమే ఫలితాలుండాలని లేదని చెప్పడం ఆనవాయితీయే. 2023 మేలో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు భిన్నంగా కాంగ్రెస్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. అలాగే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పాలక ఎన్డీయే కూటమిని నడుపుతున్న బీజేపీ మెజారిటీ మార్క్ (మొత్తం 543 సీట్లకు గాను 272) సాధిస్తుందని దాదాపు అన్ని ఎగ్జిట్‌పోల్స్ జోస్యం చెప్పాయి. ఎలాంటి సర్వేలు లేకుండా వివిధ రాష్ట్రాల్లో పర్యటనలు, ప్రజలతో సంభాషణల ద్వారా రాజకీయ, ఎన్నికల విశ్లేషకుడు యోగేంద్రయాదవ్ ఒక్కరే బీజేపీకి ఈ ఎన్నికల్లో 240 సీట్లు మించవని అంచనా వేసి చెప్పడం, అది నిజం కావడం ఈ ఏడాది సంచలనంగా భావించవచ్చు.

> **అమెరికా విషయానికి వస్తే అక్కడ ఓటర్ల అభిప్రాయాల సేకరణ ద్వారా ఎగ్జిట్‌పోల్స్ సహా ఎన్నికల సర్వేలు జరిపే ఆర్గనైజేషన్లను పోలింగ్ సంస్థలు అంటారు. 'పోలింగ్ పరిశ్రమ'గా అగ్రరాజ్యంలో ఇది పాతుకుపోయింది. అమెరికాలో ఎంతో 'శాస్త్రీయ' పద్ధతిలో కట్టుదిట్టంగా, పకడ్బందీగా ఎగ్జిట్‌పోల్స్ జరుపుతారని భావించినా వాటి జోస్యాలు కూడా తప్పని రుజువైన సందర్భాలు గత పాతికేండ్లలో అనేకం ఉన్నాయి.**

ప్రధానంగా రేపొచ్చే నవంబర్ 5 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడైన డోనాల్డ్ ట్రంప్‌పై 2016 అధ్యక్ష ఎన్నికల్లో నాటి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్ గెలుపు 90 శాతం ఖాయమని అత్యధిక ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేసి చెప్పాయి. కానీ, ఫలితం అందుకు విరుద్ధంగా వచ్చి ట్రంప్ సంచలన విజయం సాధించారు. ఈ ఏడాది ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు, డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్ తొలి దశలో సాధించిన ఆధిక్యం ఆవిరై, ట్రంప్ నెమ్మది నెమ్మదిగా ఎక్కువ జనాదరణ సాధిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

> **దీనికి తోడు పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, హమాస్, హిజ్బొల్లాల దూకుడు కారణంగా ఈ యాడు రాజ్యం దుర్మార్గ ధోరణులను వ్యతిరేకించే డెమొక్రాట్లు, లిబరల్స్ ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశాలు ఎక్కువ అని వస్తున్న వార్తల నేపథ్యంలో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. మారిన పరిస్థితుల్లో ట్రంప్ విజయం ఎవరినీ ఆశ్చర్యపరచకూడదనే వాదన కూడా నేడు బలంగా వినిపిస్తున్నది.**

మళ్లీ ఇండియా విషయానికి వస్తే సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పినట్టు ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే సర్వే, మీడియా సంస్థలు మరింత స్వీయనియంత్రణ, ఆత్మపరిశీలన ద్వారా అసలు ఎన్నికల ఫలితాలకు దగ్గరగా తమ అంచనాలు ఉండేలా కృషి చేయడం ఎంతో అవసరం. తమ సర్వే ప్రక్రియలోని లోపాలు అర్జెంటుగా సరిచేసుకోవాలి. అయితే, మొన్నటి 18వ లోక్‌సభ ఎన్నికల మాదిరిగా తొలి దశ నుంచి చివరి దశ పోలింగ్ ముగియడానికి 45 రోజులు పడితే ఎగ్జిట్‌పోల్స్ నిర్వహణ లోపరహితంగా ఉండదు. వాటి ఫలితాలు వాస్తవ విరుద్ధంగా ఉండే ప్రమాదమే ఎక్కువ ఉంటుంది. ఓటర్ల సంఖ్య దాదాపు నూరు కోట్లకు చేరిందని, పోలింగ్ సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దసంఖ్యలో సాయుధ బలగాలు అవసరమనే సాకుతో ఇలా దాదాపు రెండు నెలలపాటు సాధారణ ఎన్నికల ప్రక్రియ సాగితే ఎన్నికల ప్రజాస్వామ్యం అనుకున్న రీతిలో పరిణతి సాధించదు. ప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని లోపాలు ఇప్పుడిప్పుడే తగ్గుతున్న నేపథ్యంలో తక్షణమే ఎగ్జిట్‌పోల్స్ నాణ్యత మెరుగుపడాలనుకోవడం అత్యాశే అవుతుంది.

అంబేద్కర్‌ను విస్మరించిన జమిలి!

జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ చేసిన ప్రతిపాదనలకు ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఇటీవల సూత్రప్రాయంగా ఆమోదించింది. అయితే, ఆశ్చర్యకరమైన విషయమేమంటే.. కమిటీ నివేదికను ఆమోదిస్తూ భారత ప్రభుత్వం అంగీకారం తెలిపేముందు ఉండాల్సిన ఏకాభిప్రాయాన్ని మోదీ సర్కార్ విస్మరించింది. ఇదెలా ఉన్నదంటే.. గుర్రం కంటే ముందే బండిని కొన్నట్టు ఉన్నది.

ఎస్ఎన్ సాహు

ఒకవేళ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ గనుక బతికి ఉంటే.. సదరు కమిటీకి భారత మాజీ రాష్ట్రపతి నాయకత్వం వహించడం, ఏకకాలంలో పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలన్న ఆ కమిటీ సిఫారసులను కచ్చితంగా వ్యతిరేకించేవారు. ఆర్థిక వ్యయాలు, పరిపాలనా సౌలభ్యాలను మాత్రమే కారణాలుగా చూపుతూ కోవింద్ కమిటీ సమర్థిస్తున్న ఏకకాల ఎన్నికలు.. చట్టసభలకు ప్రభుత్వాల జవాబుదారీతనం విషయంలో ఇప్పటికే వేగంగా పడిపోతున్న ప్రమాణాలను ఏ విధంగా పెంచుతాయో వివరించలేదని ఆందోళన వ్యక్తం చేసేవారు. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వం వైపే రాజ్యాంగ నిర్మాతలు మొగ్గుచూపారు. ఎందుకంటే, చట్టసభలకు ప్రభుత్వాలు జవాబుదారీతనంపై ఇది ఆధారపడి ఉంటుంది' అని రాజ్యాంగ అసెంబ్లీలో అంబేద్కర్ పేర్కొన్నారు.

'కాన్‌స్టిట్యూషనల్ ఫౌండేషన్ ఆఫ్ వన్ నేషన్, వన్ ఎలక్షన్' పేరిట కమిటీ సభ్యుడు సుభాష్ కశ్యప్ సమర్పించిన పేజీలో ఉన్న 'అధ్యక్ష, పార్లమెంటరీ వ్యవస్థల కలయిక భారత రాజ్యాంగం' అన్న విషయం ఆశ్చర్యం కలిగించింది. అంబేద్కర్ పేర్కొన్న జవాబుదారీతనం అనే అంశానికి ఇది పూర్తి విరుద్ధం. గత పదేండ్ల మోదీ పాలనలో పార్లమెంట్‌కు ప్రభుత్వ జవాబుదారీతనం పూర్తిగా క్షీణించింది. అన్నదాతలను సంప్రదించకుండానే రైతు చట్టాలను చేసి, వాటిని ఉభయసభల్లో ఏకపక్షంగా ఆమోదించడమే (అది కూడా వాయిస్ ఓటింగ్ పద్ధతిలో) అందుకు నిదర్శనం. 2014-24 మధ్యకాలంలో ఆమోదం పొందిన పలు బిల్లులను పరిశీలించవద్దని పార్లమెంటరీ కమిటీలకు మోదీ సర్కార్ ఆదేశించడం దిగ్భ్రాంతికరం. ఈ నేపథ్యంలో చట్టసభలకు ప్రభుత్వం జవాబుదారీతనం విషయంలో రోజురోజుకు పాతాళంలోకి పడిపోతున్న ప్రమాణాలను ఏకకాల ఎన్నికలు ఎలా పెంచుతాయన్న అంశాన్ని కోవింద్ కమిటీ వివరించలేదు. ఇంకా చెప్పాలంటే ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది.



ఈ అంశానికి సంబంధించి ఏమైనా సిఫారసులు ఉన్నాయేమోనని వెతకగా.. ఒక్కటి కూడా కనిపించలేదు. రాజ్యాంగ రక్షణకు పాటుపడతానని ప్రమాణం చేసి, దేశంలోని అత్యున్నత పదవిని అధిష్ఠించిన ఒక మాజీ రాష్ట్రపతి నేతృత్వం వహించిన కమిటీ.. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అతి కీలకమైన ఈ అంశాన్ని విస్మరించడాన్ని చూసి అంబేద్కర్ కూడా ఆందోళన చెందేవారు. సంప్రదింపుల పేరిట కమిటీ కలిసినవారిలో ఏ ఒక్కరూ 'జవాబుదారీతనం' అంశాన్ని లేవనేత్తలేదు. అంతేకాదు, అవిశ్వాస తీర్మానంపై ఈ కమిటీ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడం గమనార్హం. ఒకచోట తప్పుబట్టిన కమిటీ.. 'అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం సభ్యుడి హక్కు మాత్రమే కాదు, తన బాధ్యత కూడా' అని మరో చోట పేర్కొన్నది.

అవిశ్వాస తీర్మాన నిబంధనను సవరించాలని లోక్‌సభ మాజీ జనరల్ సెక్రెటరీ సుభాష్ సీ కశ్యప్ సూచించారు. అవిశ్వాస తీర్మానంలోనే తదుపరి ప్రభుత్వాధినేత ఎవరనేది కూడా సూచించాలని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. దీని కోసం రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదని, చట్టసభల నిబంధనలను సవరిస్తే సరిపోతుందని ఉచిత సలహా కూడా ఇచ్చారు. ఎంతో సున్నితమైన ఈ సూచనను జర్మనీ రాజ్యాంగం నుంచి కశ్యప్ తీసుకున్నట్టు తెలుస్తున్నది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ప్రధాన లక్షణమైన 'జవాబుదారీతనం' క్షీణతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, దాన్ని కోవింద్ కమిటీ ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని చెప్పడంలో ఎలాంటి సంశయం లేదు. అంతేకాదు, అంబేద్కర్ దార్శనికతను, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రాతిపదికను ఇది పూర్తిగా తుంగలో తొక్కింది. అందువల్ల ఈ నివేదిక తిరస్కరణకు అర్హమైనదని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు.

('ది వైర్' సౌజన్యంతో)

టీజీ బుల్డోజర్

అనుకోలేదు
ఊహించని ఉషోదయం హైడ్రా తుఫానులా
విరుచుకుపడుతుందని అనుకోలేదు
కలలు గని కట్టుకున్న
మా ఇళ్ల ఉనికి చెరువు శిఖం గాల్లో శూన్యమని అనుకోలేదు
మా కళ్ల 'ఊసు' అన్నీ 'అశాశ్వతమ'ను వేదాంతం
వల్లించే రోజు నేడే వస్తుందని అనుకోలేదు
మేము నిరాశల పురా మనుషుల ఆనవాళ్లమా?
కన్నీళ్లు మాకు వారసత్వమా?
దుఃఖించడమే మా జీవితమా?
మమ్ములను పగబట్టిన శత్రువు ఎవడురా! ఈ హైడ్రా?

నిన్నటిదాక నిశ్చింత బస్తీ జీవులమై
నేడేమో చెరువుల్ని కబ్జా చేసిన
నేరస్థులమవుతామని అనుకోలేదు
కన్నీటి నది కన్నుల నగర వాసులమై
కట్టుబట్టలే ఆస్తులైన నిరుపేద పుర
వారసులమవుతామని అనుకోలేదు
చెరువు చట్టాలు ముంపు రహస్యాలు
దళారు దాదాల పద్మవ్యూహాలు తెల్వక
జప్పా గాళ్లచే హలాల్ చేయబడిన బలి పశువులమై
నేడు నగరంలో ప్రవహిస్తున్న నెత్తురు
కాల్వలమవుతామని అనుకోలేదు

మురికి అలల ముసి నవ్వుల మూసీ చూసినావా?
మమ్ములను నిర్వాసితులను చేసి నిండా ముంచేసినావా?
మా ముందరి అలల అందాల చెరువే
గుణపాఠం నేర్పే గురువు అవుతుందని కలలో కూడా అనుకోలేదు

హైడ్రా చూడగలదా
మా కళ్లలోని కన్నీటి చెరువులు
మా గుండెలోతు బాధల బరువులు

మార్పు మార్పని ఆశించిన మాకు
కూల్చివేతల 'రెడ్‌మార్కు'లే కనిపిస్తున్నాయి
పడగలెత్తిన హైడ్రా బుల్డోజర్‌లు మా కలలోకి వస్తున్నాయి
హైద్రాబాద్ 'హైడ్రా'బాద్ అవుతుందని అనుకోలేదు
సమున్నత లక్ష్యాల కోసం సాధించుకున్న తెలంగాణ
నేడు మా సామూహిక శోకాల పాట పాడుతున్న గాయాల వీణ
అవుతుందని అస్సలు అనుకోలేదు

చెరువుల సంరక్షణ, ముంపుల నివారణ
అవశ్యక రాగమే, అభివృద్ధి గీతమే పల్లవించనీ
చెరువు, చెరువు గట్టే కాదు నిరుపేదల 'కన్నీటి బొట్టు' గురించి
మా 'బతుకు బఫర్‌జోన్' గురించి
మా రాజులకు సోయి ఉండదని మాత్రం అనుకోలేదు

కూలిపోయిన మా బతుకుల ఆవేదన కనడానికి
మా రోదన వినడానికి
మా కష్టాలకు, కన్నీళ్లకు స్పందించడానికి
వీలుదొరకని అధినాయకుడు ఏ విదేశీ
పర్యటనలో తలమునకలై ఉంటాడనీ అనుకోలేదు

రమేశ్ నల్లగొండ
83094 52179

ఈ బుల్డోజర్ సర్పం బుసలు ఆగాలంటే
మరో అంబేద్కర్ రావాలో.. మరో రాజ్యాంగం రాయాలో
రాష్ట్రమంతా అలుముకున్న నిరాశల పొగమంచు
అరుణ భాస్కరుడు ఉదయించకుంటే పోతుందా?



వాళ్ల దురాశకు అంతే లేదు

అక్టోబర్ 15న 359 ప్రభుత్వ తీర్మానాలను, శాసనసభ ఎన్నికల షెడ్యూల్ వెలువడి ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన అక్టోబర్ 16న 23 ప్రభుత్వ తీర్మానాలను జారీ చేశారు. వాళ్ల దురాశకు అంతే లేదు. వాళ్ల దోపిడి లజ్జకు అతీతమైంది. వారి బూటకపు ప్రేమకు అంతే లేదు. మహాయుతి సర్కార్ కౌంట్ డౌన్ మొదలైంది.

- ప్రియాంక చతుర్వేది, శివసేన (యూబీటీ) ఎంపీ